# చదువుకొన్న భార్య

పురుషుల్లాగే స్త్రీలుకూడా అనేక రకాలుగా వుంటారు. చదుకున్న ప్రతీపురుషుడూ పవిత్రుడని ఢంకామీద దెబ్బ కొట్టి చెప్పలేం. అలాగే చదువుకున్న ప్రతీఆడదీ చెడ్డదనీ అనలేం. మంచీ చెడూ అనేవాటికి గుణావయవాలు చాలా వుంటాయి. వాళ్ళ వ్యక్తిగత స్వభావాలూ, పెరిగిన వాతావరణమూ, పెంచిన పెద్దల స్వభావం, మొదలైనవెన్నో!

చదువుకున్న ఆడవాళ్ళని పెళ్ళిచేసుకున్న పురుషుల్నెందర్నో ఎరుగుదును. పాపం వాళ్ళు మాత్రమేంచేస్తారు? ఆత్మ నమ్మకం లేనప్పుడు.

కాని నేను చదువుకున్న భార్యనే ఏరికోరి పెళ్ళాడాను. ఎందుకంటే వాళ్ళే కొంతవరకు "కారణానికి" నిలువగలరు. వాళ్ళని మనం వొప్పించి పరస్పరం అర్థం చేసుకునేలా చెయ్యొచ్చు. అదే చదువుకోని స్త్రీ అయితే మన తెలివితేటలు, అర్గ్యుమెంట్సు, రీజనింగ్ నిరుపయోగమౌతాయి.

ఒక రోజున సరోజని డాబామీద కూచుని కొత్తగా వెలువడిన నవలికేదో చదువుతోంది. వెనకాలే వెళ్ళి, మెల్లగా కళ్ళుమూశాను. రెండు చేతులతో తడిమి పట్టుకుని "అమ్మ దొంగా! మీరే" అంది విడిపించుకొంటూ.

కోటుకాలర్ కి పెట్టుకొచ్చిన గులాబీపువ్వు తీసి జడలో పెట్టాను.

"ఏమిటి సంగతి? ఇంత హుషారుగా వున్నారు?" అంది.

"ఈవేళ మన వైవాహికదినం. అందుకే నీకో కొత్త చీరకూడా తెచ్చాను" అన్నాను.

గులాబీరంగు చీరనీ, జాకెట్‌నీ చూస్తుంటే సరోజిని కళ్లు మెరిశాయి. ఈ ఆశించని శ్రద్ధనీ, ఎదురుచూడని ఆదరానికి సంతోషిస్తూ—

సరోజిని కిందికివెళ్ళి నూతన వస్త్రాలంకృతురాలై తిరిగి వచ్చింది.

రెండు ప్లేట్లతో టిఫిన్, ఫ్లాస్కుతో కాఫీకూడా తెచ్చింది.

"ఇదేమిటో చెప్పుకోండి" అంది స్వీటుని చూపిస్తూ. నా కెంత ఆలోచించినా ఏమీ తోచలేదు.

"ఏమిటి?" అన్నాను.

"బెనారస్ హల్వా"

రుచి చూశాను చాలా బాగుంది; కిరణబేధ్యంగా కనపడుతూ, ఆకర్షణీయంగా వుంది.

'అదేమిటి?' అంది

"పులిహార"

'రుచిచూసి చెప్పండి'

చూశాను. భేదం తెలీలేదు. 'ఏమిటిది?' అన్నాను. 'మామిడికాయ పులిహార'

అదే సమయంలో కిందినించి నారాయణరావువచ్చాడు. అతనుకూడా టిఫిన్‌లో భాగస్వామి అయ్యాడు.

చివర్న సరోజిని చెప్పింది. "మేంతిన్న హల్వా బూడిద గుమ్మడికాయతో చేశాను" అని.

"ఇవన్నీ ఎక్కడ నేర్చుకున్నారు?" అన్నాడు నారాయణరావు.

"ప్రమదావనంనుండి" అంది. అతడు మాలతీ చందూర్‌కు అభినందనలు తెలిపాడు.

కొంతసేపయ్యాక "అలా పార్కువైపు వస్తావా?" అన్నాడు.

అప్పటికి సాయంత్రం ఐదున్నరయింది. సరోజనిని సినిమాకి సిద్ధంకమ్మని అతనితో బయలుదేరాను.

పార్కులో బెంచీమీద కూచున్నాం. ఆకాశవాణి కర్నాటక సంగీతాన్ని పెను తుపానులా విసురుతోంది - ఆ తబలా చప్పుళ్ళతో శ్రోతల మెదళ్ళల్లోని నరాలు పగిలేలాగ.

పార్కు బెంచీ ఎన్నోవింతగాథల్ని వినివిని అలసిపోయి, సొలసినట్టు, ఎన్నోరకాల ప్రజలను భుజస్కంధాలపై మోసినట్టు; నిశ్శబ్దంగా అణిగి పడివుంది.

"కొంచెం విజ్ఞానం సంస్కారం వుంటుందిగదా అని నీలాగే సుఖపడనచ్చునని నేనూ చదువుకున్న అమ్మాయిని పెళ్ళాడాను. కాని ఈ ఎనిమిది నెలల్లోనూ యింతవరకు నేను పొందిన సుఖమన్నది సున్నా! జీవితాన్ని సుఖమయం చేసుకోడానికి ఎంతో ప్రయత్నించి, చివరికి విఫలుడినయ్యాను. ఇదే ఇంకో చదువుకోని స్త్రీ అయితే నయాన్నో భయాన్నో నా ఆశయాల కనుగుణంగా చేసుకొని వుందునేమో?"

"కాని...నీ జీవితంలో నువ్వు హాయిగా బ్రతుకుతున్నావు. నిన్ను చదివి అర్థం చేసుకుందా మనుకున్నా సాధ్యం కాలేదు."

"ఏమిటీ తేడా! ఎక్కడుందీ లోపం?" అంటూ నారాయణరావు వాపోసాగాడు.

నాకు అమితమైన జాలి, సానుభూతి కలిగాయి. ఓదార్పుకని ఇలా అన్నాను:

"భార్య చదువుకున్నదా కాదా అన్నది కాదు సమస్య. జీవితం సుఖమయం కావడానికి స్త్రీ పురుషులు పరస్పరం అర్థం చేసుకోవాలి. ఇద్దరూ కొన్ని నియమాల్ని పాటించాలి.

సాంసారిక జీవితాన్ని సుఖమయం చేసుకునేందుకు నేనీ విషయాలు పాటిస్తాను. నీకు మంచివనితోస్తే నువ్వూ అనుసరించు"

కాసేపు ఆగాను. గృహాన్ని ఆనందదాయకం చేసుకోడానికి మార్గాలను తెలిపిన పూర్వం చదివిన పుస్తకంలోని విషయాల్ని గుర్తుకు తెచ్చుకుని మా జీవితంలోని సంఘటనలతో కలిపి జతచ్చే చెప్పసాగాను.

నారాయణరావు ఆత్రుతతో వినసాగాడు.

'మనం పెళ్ళివిషయంలో నిరక్షరాస్యులుగా మారకూడదు. గృహ జీవితాన్ని సుఖతరం చేసుకొనే మార్గాలను తెలిపే పుస్తకాలను ఎక్కువగా చదవాలి. వైవాహిక జీవితంయొక్క సెక్స్యుయల్ సైడ్‌ని గురించి తెలిపే మంచిపుస్తకాన్ని ఒకదాన్నైనా చదవాలి.

'ఆడవాళ్ళని అప్పుడప్పుడు బహుమతులతోను, పాత జ్ఞాపకాలతోనూ ఎప్పటికీ 'కోర్ట్' చేస్తూండాలి. మనం వాళ్ళ నితరులవద్ద విమర్శించకూడదు. సరోజని ఇష్టమొచ్చినప్పుడు ఖర్చుచేసుకోడానికి కొంతపైకాన్ని చ్చేస్తాను. ఆవిడ 'మూడ్సు'ని

అర్థంచేసుకొని అలసట పొందినప్పుడూ, బలహీనంగా వున్న ప్పుడూ కొంత సహాయం చేస్తుంటాను.

'అదిగాక నా తీరిక కాలంలో సగమన్న ఆవిడవద్ద గడుపు తాను. ఆవిడ మేధా జీవితంలో కొంత శ్రద్ధతీసుకుని, మంచి పుస్తకాలని చదవడం, క్లబ్‌కి పోవడం, సినిమాలకు తీసుకు వెళ్ళడం మొదలైనవి చేస్తాను. ఎవళ్లైనా స్నేహితులు స్నేహ పూర్వకంగా ఆమెతో సంభాషిస్తున్నా, శ్రద్ధాసక్తులు ప్రద ర్శిస్తున్నా, ఈర్ష్యతో కూడిన మాటల్ని విసరకుండా సహిస్తాను.

'ఆడవాళ్ళదగ్గర ఇంకో లక్షణముంది. ఏదైనా ఘన కార్యం చేసినప్పుడు మనదగ్గరనుండి పొగడ్తని ఆశిస్తారు. అందు కని మనకేదైనా స్వల్పసహాయమైనసరే చేసినప్పుడు కృతజ్ఞత తెల్పకుండా వుండకూడదు. అవసరమైనచోట్ల స్వల్పస్తోత్రాన్ని కూడా మానకూడదు.

"సరోజిని దగ్గరకూడా చెప్పుకోదగిన గుణాలు లేక పోలేదు. వాటిని తక్కిన స్త్రీలు కనుక అనుసరిస్తే వాళ్ళ జీవి తాలు సుఖమయమౌతాయనడానికి సందేహంలేదు. భోజనానికి కూర్చుంటానా? ఏం వడ్డిస్తుందో తెల్సుకోగలగడం ఎప్పటికీ సమస్యే! ఎవేవో కొత్తకొత్త వంటకాలు చేస్తుంది. చదువునీ సంస్కారాన్నీ విజ్ఞానాన్నీ వినియోగించి ఎప్పటికీ అన్ని విష యాల్లోనూ 'కొత్తదనాన్ని' నిలుపుకోడానికి ప్రయత్నిస్తుంది. ఇంటి నెప్పుడూ ఆకర్షణీయంగానూ, అందంగానూ, ఆసక్తి కలిగించేదిగానూ వుంచుతుంది.

"నేను నెరవేర్చబోయే కొన్ని పనులమీద నాభా వాన్ని తెలివిగా గ్రహించి, వాటిమీద సహకారంగా చర్చి

స్తుంది. నాపనులలో అనవసరజోక్యం కలిగించుకోక, పూర్తి స్వేచ్ఛ నిస్తుంది. నేను పనిచేసే కాలాన్నిగాని, నా స్నేహితుల్నిగాని విమర్శించదు.

'నాబంధువులెవరైనా వచ్చినా వాళ్ళతో జాగ్రత్తగా సర్దుకుపోడానికి ప్రత్యేకమైన ప్రయత్నాన్ని చేసైనా, సానుకూలంగా ప్రవర్తిస్తుంది. సాధారణస్త్రీలు చేసేలా నాతప్పుల్ని విమర్శించడంగాని, నన్ను నాకంటే జీవితంలో జయాన్ని పొందిన వాళ్ళతో పోల్చడంగాని చెయ్యకుండా, ఆర్థికబాధలు కలిగినప్పుడూ, ఇతర చెడ్డపరిస్థితుల్లోనూ ధైర్యంతో, సంతోషంతో వాటి నెదుర్కొంటూ, నా సహధర్మచారిణిగా గడుపుతుంది. స్వల్ప భేదాభిప్రాయాలు కలిగినా సామరస్య దృష్టితో అంగీకారానికి వస్తుంది.

"ఇంకొక గొప్పతన మేమిటంటే సరోజని నాకునచ్చిన దుస్తుల్నీ, స్టయిల్సునీ అనుకరిస్తుంది. నాకు అభిమానమైన ఆటల్ని నేర్చుకుని నా తీరికకాలంలో భాగస్వామిని అవుతుంది. కొత్తగా వెలువడే పుస్తకాలనీ, పత్రికల్నీ చదువుతూ నా ఇంట లెక్చ్యువల్ ఇంటరెస్ట్‌నిపట్టివుంచి, తదనుకూలంగా కాలక్షేపం చేస్తుంది.

ఒక మాటలో చెప్పాలంటే సరోజనే నేను, నేనే సరోజని, అవీ మాజీవితం సుఖప్రదం కావడానికి తోడ్పడే విషయాలు" అని ముగించాను.

ఇవన్నీ విన్న నా స్నేహితుడు ఎడతెగని ఆలోచనలో పడి తెల్లబోయాడు.

'ఎంత, చదువుకొన్నామని విర్రవీగుతున్నా మనకు తెల్సిన జ్ఞానం తెల్సుకోవలసిన విజ్ఞానంతో పోలిస్తే సముద్రం లోని నీటి బిందు వంతన్నమాట' నారాయణరావు ఆలోచన లేమాటలరూపంలో ధరించాయి గావును.

'టైమవుతోంది సినీమాకి పోదాంరా' అన్నాను లేస్తో

'నా చదువుకొన్న భార్యనుకూడ తీసుకొస్తాను. మీ దంపతులనుండి, మేం నేర్చుకోవలసినవి చాలా వున్నాయి' అని లేచాడతను.

గ్రామస్థుల కార్యక్రమంలోగావును "సంసారం" అనే ఘంటశాలపాట వస్తోంది.

———